ఇంటర్ విద్యార్థులకు అందుబాటులో నిథమ్ కోర్సులు

ఫ్యాకల్టీ డాక్టర్ కిరణ్మయి, మిషెల్లీ జే ఫ్రాన్సిస్

రాయదుర్గం: ఇంటర్ పాసైన విద్యార్థులకు గచ్చిబౌలిలోని ‘నిథమ్’లో పర్యాటక, ఆతిథ్య కోర్సులు అందుబాటులో ఉన్నాయని నిథమ్ ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ కిరణ్మయి, మిషెల్లీ జే ఫ్రాన్సిస్ మంగళవారం వెల్లడించారు. 30 ఎకరాల స్థలంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన క్యాంపస్ అందుబాటులో ఉందన్నారు. నాలుగు ఏళ్ల కాలపరిమితితో కూడిన బీబీఏ డిగ్రీ (టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ), మూడేళ్ళ కాలపరిమితితో కూడిన బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) వంటి కోర్సులు ఉన్నాయన్నారు. 40 శాతం మార్కులతో పాసైన వారు చేరవచ్చన్నారు. 100 శాతం ప్లేస్‌మెంట్‌లున్న జాతీయ విద్యా సంస్థగా నిథమ్ గుర్తింపు పొందిందని వారు పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి హోటళ్ళు, రెస్టారెంట్లు, ట్రావెల్, ఎయిర్‌పోర్టులు, ఈవెంట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ వంటి వాటిల్లో అవకాశాలు లభిస్తాయని వారు పేర్కొన్నారు.

పటేల్‌కుంట పార్కు పరిశీలన


హుడా పార్కును పరిశీలించిన కార్పొరేటర్ రోజాదేవి రంగారావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని పటేల్‌కుంట పార్కును అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మంగళవారం పరిశీలించారు. ఓపెన్‌జిమ్ మెయింటెనెన్స్ చేపట్టాలని కోరారు. వాకింగ్ ట్రాక్ టైల్స్, టాయిలెట్స్ రిపేర్ చేయాలని, సెప్టిక్ ట్యాంక్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు హెచ్ఎండీఏ డీఈ జగన్, ఏఈ సంధ్య, పార్కు సభ్యులు చెన్నయ్య, కొండయ్య, రామచంద్రయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నూతన జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని మంగళవారం చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ వంశీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జోనల్ కమిషనర్‌ను కలసిన కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శేరిలింగంపల్లిలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో నూతన జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిను మంగళవారం రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

ఐఎస్‌బీలో పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారులు, ఐఎస్‌బీ ఫ్యాకల్టీ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో నూతన పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. ఐఎస్‌బీలోని భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఆధ్వర్యంలో ‘టెక్నాలజీ, పాలసీ అండ్ ఇన్‌క్లూజన్: యాన్ ఇంటర్‌సెక్షన్ ఆఫ్ ఐడియాస్ ఫర్ పబ్లిక్ పాలసీ’ పేరిట రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా ‘ఇన్నోవేషన్, ప్రాక్టీస్ అండ్ ఫ్యూచర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఇన్ ఇండియా’ పేరిట మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు.మణిపూర్ మాజీ గవర్నర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి వినోద్‌కుమార్ దుగ్గల్, భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి. నందకుమార్, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ , విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆర్‌పి సింగ్‌లు ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం విశ్రాంత ఐఏఎస్ అధికారి, పుస్తక రచయిత అమర్జీత్‌సింగ్ మాట్లాడుతూ పుస్తకం పరిశోధకులకు, విధాన రూపకర్తలకు, అభ్యాసకులకు ఒక అనివార్య సాధనమన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఫైనాన్స్ అసోసియేట్ ప్రొఫెసర్, పుస్తక సంపాదకుల్లో ఒకరైన డాక్టర్ పురాన్‌సింగ్ మాట్లాడుతూ సాంకేతికత అనేది సమస్యలను పెద్ద ఎత్తున పరిష్కరించడానికి ఉపయోగించే సాధనమన్నారు. అయితే చాలా మందికి సాంకేతికత అందుబాటులో లేదనే వాస్తవాన్ని మనం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీ పూర్వ విద్యార్థి, పుస్తక రచయితలలో ఒకరు, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అంకిత్ ఆనంద్, ఐఎస్‌బీ బీఐపీపీ డైరెక్టర్ డాక్టర్ ఆరుషి జైన్, రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అంజల్ ప్రకాశ్ ప్రసంగించారు.

విద్యార్థుల నిరసన సమంజసం కాదు

హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో క్రమశిక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సుకూన్ నిర్వహణ, విద్యార్థుల సస్పెన్షన్ అనివార్య పరిస్థితులలో తీసుకున్న చర్యలని పేర్కొన్నారు. హెచ్‌సీయూలో సుకూన్ కార్యక్రమం నిర్వహణపై స్పష్టమైన వైఖరి తెలిపామని, విద్యాకార్యకలాపాలకు అంతరాయం కలగకుండా స్టూడెంట్ యూనియన్ అకడమిక్ కేలండర్‌కు విరుద్ధంగా తేదీలను ప్రతిపాదించడం, మే 18న వీసీ నివాసం వద్ద అర్ధరాత్రి నిరసనలతో వీసీ తల్లి (95) తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని, ఎంత విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా నిరసన చేయడం తగదన్నారు. ఈ విషయంలో అందరినీ సంప్రదించి విద్యార్థుల సస్పెన్షన్‌తో తగిన ప్రక్రియను అనుసరించామన్నారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకునే వరకు నిరసన తెలుపడం సమంజసం కాదని పేర్కొన్నారు.

16 మందికి జరిమానా

ఇద్దరికి జైలుశిక్ష

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహన దారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 16 మందికి జరిమాన, మరో ఇద్దరికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆది, సోమ వారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో 18 మంది పట్టుబడ్డారు. వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 16 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా,మరో ఇద్దరికి రెండు వేల జరిమానాతో పాటు ఒకరికి మూడు రోజులు, మరొకరికి రెండు రోజులు జైలు విధించినటు పోలీసులు పేర్కొన్నారు.

గణేష్‌గడ్డ కిటకిట



పటాన్‌చెరు టౌన్: అంగారక సంకష్టహర చతుర్థి సందర్భంగా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్‌గడ్డ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు సంతోష్‌జోషి, జగదీశ్వర్‌స్వామి, చంద్రశేఖర్, అయ్యప్పలు ప్రత్యేక పూజలు చేశారు.భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్లు తెలిపారు. ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.




మియాపూర్ పటేల్ చెరువులో అలుముకున్న గుర్రపుడెక్క

చెరువులు కలుషితం

గుర్రపుడెక్క, మురుగుమయం • దోమలు.. దుర్వాసనతో ఇబ్బందిపడుతున్న పరిసర ప్రాంతవాసులు

మియాపూర్: చెరువులు, కుంటలు కలుషితమై దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. డ్రైనేజీ, వ్యర్థ జలాలు, చెత్త ఇలా అన్నీ చెరువుల్లోకి చేరిపోతున్నాయి. ఓ వైపు గుర్రపు డెక్క , మరో వైపు చెరువుల వద్ద వ్యర్థాలు పారబోస్తుండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. చెరువులు, నాలా పరీవాహక ప్రాంతవాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మియాపూర్ గురునాథం చెరువు, పటేల్ చెరువు, రామసముద్రం చెరువు, మక్తమహబూబ్‌పేట్ చెరువు, రేగులకుంట చెరువు, నాయినమ్మ కుంట చెరువు, కిందికుంట చెరువులు చాలా వరకు కలుషితమయ్యాయి.

- ఏటా చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితం నెరవేరడం లేదు. చెరువుల్లో మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకుంటామన్న ప్రజాప్రతినిధులు, అధికారుల హామీలు అలాగే మిగిలిపోయాయి.
- చెరువుల్లో దోమల మందు పిచికారీ, నివారణ చర్యలు తీసుకోకపోవడంతో దోమలు ప్రబలుతున్నాయి.
- మియాపూర్ పటేల్ చెరువు, గురునాథం చెరువు, మక్తమహబూబ్‌పేట చెరువు, బీకే ఎన్‌క్లేవ్ వద్ద కిందికుంట చెరువు, రామసముద్రం చెరువు, నాయినమ్మ కుంట చెరువుల అభివృద్ధి పనులను 3 సంవత్సరాల కిందట చేపట్టారు. నేటికి సగభాగం కూడా పూర్తి కాలేదు.


గురునాథం చెరువు

- చుట్టుపక్కల కాలనీల నుండి మురుగు చెరువులోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- చెరువులు,నాలా పరిసరాల ప్రాంతాల్లో నివాసముండే వారు సాయంత్రం, రాత్రి తలుపులు, కిటికీలు తెరిస్తే ఇక అంతే సంగతులు.
- దోమ కాటుతో డెంగ్యూ, మలేరియా, విష జ్వరాల బారిన పడుతున్నామని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఫాగింగ్ చేయాలని కోరారు.
- చెరువుల్లో మురుగునీరు కలవకుండా గుర్రపుడెక్క విస్తరించకుండా చర్యలు చేపట్టాలి. చెరువు చుట్టుపక్కల ప్రాంతాలు, కాలనీల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


నాయినమ్మ చెరువు

పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐగా లాలూనాయక్

పటాన్‌చెరు టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ లాలు నాయక్ హెచ్చరించారు. ప్రస్తుత ట్రాఫిక్ సీఐ శ్రవణ్ కుమార్ బదిలీపై హైదరాబాద్ ఐజి కార్యాలయానికి వెళ్లారు. సంగారెడ్డి పోలీస్ కంట్రోల్‌రూమ్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న లాలు నాయక్ పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

27న నిధి ఆప్కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా ఈ నెల 27 న నిధి ఆప్కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. చందానగర్ మై హోం జువల్ అపార్ట్‌మెంట్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని ఆల్ఫా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సదాశివపేట మండలం చందాపూర్‌లోని పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లలో భవిష్య నిధి సమస్యలు ఉన్న వారు పరిష్కరించుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

నిజాంపేట్: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంఛార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం ప్రగతినగర్ శ్మశానవాటికలో బోరు పనులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ ఇతర సదుపాయాలను కల్పించాలని కోరారు.

ఎరకు చిక్కని చిరుత

అదనపు కెమెరాల ఏర్పాటుకు చర్యలు

శంషాబాద్ రూరల్: జనాలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత పులి బోనుకు చిక్కలేదు. ఘాంసిమియాగూడ, శంకరాపురం పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. చిరుతను బంధించడానికి ఈ నెల 24న అటవీశాఖ అధికారులు ఘాంసిమియాగూడ వద్ద రెండు బోన్లు ఏర్పాటు చేసి అందులో కుక్కలను ఎరగా పెట్టారు. బోన్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే వరుసగా రెండు రోజులపాటు చిరుత సంచారం సీసీ కెమెరాల్లో నిక్షిప్తం కాగా, బోన్లు ఏర్పాటు చేసిన తర్వాత చిరుత జాడ కనిపించడం లేదు. దీంతో ఘాంసిమియాగూడ పరిసర ప్రాంతాల్లో మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

30న సహజ యోగా మహోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సహజ యోగా మహోత్సవ కమిటీ సభ్యులు

హఫీజ్‌పేట్: సహజ యోగా మహోత్సవంను ఈ నెల 30వ తేదీ చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు సహజ యోగా రాష్ట్ర కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం చందానగర్‌లో రాష్ట్ర కమిటీ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది యోగా సాధనతో ఆధ్మాతిక సంతృప్తిని పొందుతున్నారన్నారు . హైదరాబాద్ సహజ రియలైజేషన్ టూర్‌ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహిస్తారని సుమారు 500మంది ప్రతినిధులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్నారన్నారు. ఈ సహజ యోగా దినోత్సవానికి ప్రతి ఒక్కరు తమ కుటుంబంతో, స్నేహితులతో కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరు కృష్ణ, కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సుప్రభ, ప్రమోద్, కిరణ్, మాజీ కోఆర్డినేటర్ సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

అభ్యాస బాలురు ఆల్ రౌండ్ ప్రదర్శన



అండర్-14 విజేత అభ్యాస స్కూల్ బాలుర జట్టు


అండర్-17 విజేత బాలుర జట్టు

రాయదుర్గం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజనల్ ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ స్కూల్స్ స్పోర్ట్స్ మీట్-2024లో అభ్యాస పాఠశాల విద్యార్థులు ఛాంపియన్స్‌గా నిలిచారు. గచ్చిబౌలిలోని ఎస్ఎస్ఆర్ బాలుర పాఠశాలలో నిర్వహించిన హాకీ పోటీలలో అండర్-14, అండర్-17, అండర్-19 మూడు విభాగాల్లోనూ క్లీన్ స్వీప్ చేసి స్వర్ణపతకాలు సాధించింది. యూ-14 జట్టు ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ హైదరాబాద్‌పై 4-0 స్కోరుతో, యూ-17 జట్టు 1-0 స్కోరుతో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పైన, యూ-19 జట్టు 3-0 స్కోరుతో ఎస్ఎస్ఆర్ పైన అభ్యాస జట్లు గెలుపొందాయి.

అంబీర్ చెరువులో దోమల నివారణ చర్యలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువులో దోమల నివారణకు మంగళవారం ఎంటమాలజీ సిబ్బంది ఎంఎల్ఓ ఆయిల్ బాల్స్ వేశారు. నీటి నిల్వల్లో దోమలు గుడ్లు పెట్టి ఉత్పత్తికి కారణమవుతాయని ఆయిల్ బాల్స్ వేస్తే దోమలు వృద్ధి చెందవన్నారు. ఇంటి ఆవరణలో, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. దోమకాటు ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌కాలనీ, నెక్స్ అపార్టుమెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దామోదర్‌రెడ్డి, ట్రెజరర్ ధర్మారెడ్డి, బ్రహ్మయ్య, బాలాజీ రెసిడెన్స్ అపార్టుమెంట్ గోపాల్ రాజు, గరికపాటి సాంబశివరావు, ఎంటమాలజీ సిబ్బంది మురళి, కనకయ్య, మధు పాల్గొన్నారు.


అంబీర్ చెరువులో ఆయిల్ బాల్స్ వేస్తున్న ఎంటమాలజి సిబ్బంది

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 70, పచ్చిమిర్చి 90, బెండ 60, కాకర 70, దొండ 40, దోస 50, ఆలు 40, చామ 60, కీర 40, బీర 70, వంకాయ 40, గోకర 70, బీన్స్ 140, బీట్‌రూట్ 60, క్యాప్సికమ్ 90, క్యాబేజీ 40, క్యారెట్ 80, చిక్కుడు 120, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 280.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ, రోడ్డు నంబర్ 2లోని శ్రీ వీరాంజనేయస్వామి, నీలకంఠేశ్వరస్వామి వారి దేవస్థానం 38వ వార్షిక మహోత్సవాలు 25వ తేదీ మంగళవారం నుంచి 27వ తేదీ గురువారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటలకు నిత్యహవనం, పంచముఖ ఆంజనేయస్వామి అభిషేకం, వసంతోత్సవం, సాయంత్రం 6 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన, మహాలక్ష్మీ హోమం, పూర్ణాహుతి తీర్థప్రసాద గోష్టి, 27వ తేది గురువారం సాయంత్రం 7 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

జులై 1 వరకు వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీ కాలనీ,రోడ్డు నంబర్ 4లోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 మంగళవారం నుంచి జులై 1వ తేదీ సోమవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కేంద్రమంత్రులను కలిసిన బీజేపీ నాయకులు


మంత్రి కిషన్‌రెడ్డిని సత్కరించిన నాయకులు రవికుమార్ యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఇతర నాయకులు

గచ్చిబౌలి: కేంద్ర మంత్రులను బీజేపీ శేరిలింగంపల్లి నాయకులు మంగళవారం న్యూఢిల్లీలో కలిశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, పార్టీ శేరిలింగంపల్లి నాయకులు రాధాకృష్ణయాదవ్, ఎల్లేషులు మంత్రులను కలిశారు. కేంద్ర మంత్రులుగా, పార్లమెంటు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిని కలిశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎంపీలు ఈటల రాజేందర్, డికే అరుణలను కలిసి శాలువాలతో సత్కరించారు.

బోనాల నిధులకు దరఖాస్తు చేసుకోండి

మియాపూర్: బోనాల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులకు శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల నిర్వాహకులు జూన్ 30వ తేదీలోగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఇందుకు సమర్పించవలసిన పత్రాలు గుడి పేరు మీద ఉన్న లెటర్‌హెడ్, గుడి పేరు మీద ఉన్న బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, గుడి ఫొటో, దేవాలయం చైర్మన్ లేదా కార్యదర్శి ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను జత చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

లయన్స్ క్లబ్ చేయూత



హఫీజ్‌పేట్: తారానగర్ విద్యానికేతన్‌లో పదవ తరగతి చదువుతున్న అశ్రా సిద్ధికి విద్య నిమిత్తం లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపకుడు కొండ విజయ్‌కుమార్ మంగళవారం కార్యాలయంలో రూ.20వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డురాకూడదని ఆలోచనతో తమ క్లబ్ చేయూతనందిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి అమర్ పాల్గొన్నారు.

గుట్కా కేంద్రంపై దాడులు

రూ. 8 లక్షల విలువైన గుట్కా పట్టివేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని గుట్కా కేంద్రాలపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా కేంద్రాలపై దాడులు చేపట్టారు. మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్‌లో దత్తు అనే వ్యక్తి అక్రమంగా గుట్కా నిల్వ ఉంచాడు. దీని విలువ రూ.8లక్షలు. ఈ గుట్కాను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వ్యాపార కేంద్రాలపై నిఘాను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ దశరథ్, సిబ్బంది సంజీవ, చంద్రశేఖర్, మల్లేశ్, జైపాల్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రాలు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): ఖాజీపల్లి గ్రామంలో కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు మంగళవారం వినతి పత్రాలను అందించారు. జేఏసీ చైర్మన్ దండె రమాకాంత్ ఆధ్వర్యంలో ఖాజీపల్లి ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ అరుణ, సీఐ గంగాధర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్‌లకు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా దండె రమాకాంత్ మాట్లాడుతూ రసాయన పరిశ్రమల కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారిశ్రామికవాడలో నివాసం ఉంటున్న ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కుమార్‌యాదవ్, భీమ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో పారిశుధ్య పనులు పకడ్బందీగా జరగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు ఆదేశించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో కౌన్సిలర్ బి.యాదమ్మతో కలిసి పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లపై చెత్త కనపడకూడదన్నారు. ఎక్కడైనా చెత్త కుప్పలు పేరుకుపోయి ఉంటే వెంటనే తొలగించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా మ్యాన్‌హోల్‌ల వద్ద చెత్త ఇరుక్కుపోయి నీటి ప్రవాహం సాఫీగా సాగక లోతట్టు ప్రాంతాలను ముంచి వేస్తాయన్నారు. పారిశుధ్య పనుల్లో అలసత్వం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.